# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 24, డిసెంబర్ 2025




# తెలంగాణ రాష్ట్రానికే తలమానికం సింగరేణి సంస్థ

- శ్రీరాంపూర్‌లో ఘనంగా 137వ సింగరేణి ఆవిర్భావ వేడుకలు
- ఉత్పత్తి లక్ష్యాల సాధనలో రక్షణను విస్మరించొద్దు
- నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే సంస్థ పురోభివృద్ధి
- ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్



**నస్పూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో దేశ, రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీరుస్తూ తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తోందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ ఆవరణలో 137వ సింగరేణి ఆవిర్భావ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. మార్కెట్లో నాణ్యమైన బొగ్గుకు మాత్రమే డిమాండ్ ఉందని, ఉద్యోగులందరూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తి సాధనలో రక్షణను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదని, సింగరేణిని ప్రమాద రహిత (జీరో హార్మ్) సంస్థగా తీర్చిదిద్దాలని కోరారు. గత ఏడాది సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు నాణ్యతలో అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి వ్యాప్తంగా 1500 హెక్టార్లలో ఆరు కోట్ల మొక్కలను నాటినట్లు జీఎం తెలిపారు. సింగరేణి సేవా సమితి ద్వారా శ్రీరాంపూర్ ఏరియాలో 600 మందికి పైగా మహిళలకు వివిధ అంశాల్లో శిక్షణ అందించి, వారు స్వయం ఉపాధి పొందేలా సహకరించామని వివరించారు. ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో లేని విధంగా సింగరేణిలో ఉద్యోగులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని, సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. ముఖ్యంగా గైర్హాజరు అయ్యే ఉద్యోగులు తమ హాజరు శాతాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆర్కే న్యూటెక్ గని 112 శాతం బొగ్గు ఉత్పత్తితో






ముందంజలో ఉండటం అభినందనీయమని కొనియాడారు. బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం వీరభద్రరావు మాట్లాడుతూ.. సింగరేణి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నేడు ఉజ్వల భవిష్యత్తు వైపు సాగుతోందన్నారు.

### ఆకట్టుకున్న ఎంఎస్ ఫార్ములా ప్రసంగం..

ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ పనిగంటల సద్వినియోగంపై ఇచ్చిన ప్రసంగం అందరినీ ఆలోచింపజేసింది. ఆయన వివరించిన ఎంఎస్ ఫార్ములా (మదర్ సింగరేణి), మిగతా 2లో..

---

## షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, డిసిపి ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్‌లతో కలిసి పోలీస్, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు, నూతనంగా ఎన్నికైన మిగతా 2లో..

---

## జంగుబాయి ఉత్సవాలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**కెరమెరి, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో జనవరి 17, 2026 వరకు జరుగనున్న జంగుబాయి ఉత్సవాలలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం కెరమెరి మండలం హట్టి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, జిల్లా అదనపు ఎస్.పి. చిత్తరంజన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ జంగుబాయి దేవస్థానం కమిటీ సభ్యులు సర్పంచ్ ఆత్రం లక్ష్మణ్ లతో కలిసి అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవం జంగుబాయి ఉత్సవం సాంప్రదాయబద్దంగా నిర్వహించాలని, ఈ నెల డిసెంబర్ నెల 22 నుండి జనవరి 17,2026 వరకు జరగనున్న ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు మిగతా 2లో..




---

### మొదటి సంతకంతో

## ఆడబిడ్డకు ఆర్థిక భరోసా

- ప్రమాణస్వీకారం వెంటనే రూ. 5116 చెక్కు అందజేత
- హామీ అమలుతో ఆదర్శంగా నిలిచిన ఎల్కపల్లి సర్పంచ్ భక్తు రాంచందర్



**పెంచికల్‌పేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

ఎన్నికల హామీలు మాటలకే పరిమితమయ్యే రోజుల్లో ఎల్కపల్లి గ్రామానికి చెందిన నూతన సర్పంచ్ భక్తు రామచందర్ తన కార్యాచరణతో భిన్నంగా నిలిచారు. సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీని ప్రమాణస్వీకారం రోజే కార్యరూపం దాల్చి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. సోమవారం మిగతా 2లో..

## తెలంగాణ రాష్ట్రానికే తలమానికం సింగరేణి సంస్థ

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు, కార్మికుల విధులను విశ్లేషించిన తీరు వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

**ఉత్తమ ఉద్యోగులకు సన్మానం..**

వేడుకల్లో భాగంగా ఏరియా పరిధిలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులు, అధికారులను జీఎం ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం చిన్నారులు, కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం వీరభద్రరావు, సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమారాణి, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏరియా ఇంజనీర్ టి. రమణ రావు, ఏజీఎం (సివిల్ క్వాలిటీ) బి. నవీన్, ప్రాజెక్ట్ అధికారులు ఏ. వెంకటేశ్వర రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, ఏజెంట్లు కుర్మ రాజేందర్, శ్రీధర్, రవి కుమార్, డీజీఎంలు ఎస్. అనిల్ కుమార్, ఆనంద్ కుమార్, హరి నారాయణ, రాజన్న, విజయ్ కుమార్, సర్వే అధికారి నర్సింగరావు, డీవైసీఎంఓ డాక్టర్ పి. రమేష్ బాబు, లా అధికారి మల్లేష్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్, ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసులు, పరిష్కారం, బాధితులకు న్యాయం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న ఎస్సీ, ఎస్టీ సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు శాఖ పరిధిలోని అట్రాసిటీ కేసులు కార్యచరణ ప్రకారంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులలో తప్పుడు కేసులు నమోదు చేసిన వాటి వివరాలను స్పష్టంగా రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో ఫిర్యాదుదారులు చేసిన ఫిర్యాదులో వివరాలు సక్రమంగా ఉన్నట్లయితే సమగ్ర విచారణ జరిపి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత సమావేశంలో చర్చించిన ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదించగా కొంతమేర మంజూరు చేయడం జరిగిందని, సదరు పరిహారం మొత్తాన్ని బాధితులకు అందించడం జరిగిందని తెలిపారు. ప్రతి నెల నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం నిర్వహణలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పౌర హక్కుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి, నిషేధిత మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా చేపట్టాలని, జిల్లాలో క్రయ విక్రయాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు నిర్వహించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన సంక్షేమ వసతి గృహాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నాణ్యమైన విద్య బోధన అందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, బెక్కం రాజారావు, దుర్గం ఎల్లయ్య, పెద్ది రాజన్న, జిల్లా పౌర సంబంధాల అధికారి యం. కృష్ణమూర్తి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి అంజయ్య, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జంగుబాయి ఉత్సవాలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, హైపో క్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయడం నిరంతరం జరగాలని, 24 గంటలు వైద్య శిబిరాల ఏర్పాటుతో పాటు అంబులెన్స్ లను అందుబాటులో ఉంచి నిరంతర వైద్య సేవలు అందించాలని తెలిపారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్ మాట్లాడుతూ నీటి సరఫరా, మరుగుదొడ్లు అవసరమైన మేరకు ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్, రోడ్లకు ఇరువైపుల మొక్కలను తొలగించే విదంగా చూడాలని తెలిపారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా, అవసరమైన పూజ సామాగ్రి, విద్యుద్దీకరణ వంటి పనులను అధికారులు సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భక్తులు బస చేయడానికి 2 షెడ్లు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరగా త్వరలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ కోటపరందోలిలో ఉన్న జంగుబాయి దేవస్థానం సందర్శించి అక్కడి ఏర్పాట్లను సందర్శించి, భక్తులను, కమిటీ సభ్యులను, నాయకులను ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకొని ఎవరికి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగంలో విస్తరణతో సింగరేణి సంస్థ ఆర్థిక పరిపుష్టి సంతరించుకుంటుంది

జైపూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త



విద్యుత్ రంగంతో పాటు వివిధ రంగాల్లో విస్తరణతో సింగరేణి సంస్థ ఆర్థిక పరిపుష్టి సంతరించుకుంటుందని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈడి చిరంజీవి అన్నారు. మంగళవారం సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిథిగా పవర్ ప్లాంట్ ఈడి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈడి మాట్లాడుతూ సింగరేణి ఆవిర్భవించి 137 సంవత్సరాలు అవుతుందని, మొదట్లో దక్కన్ కంపెనీగా ఉండి ఆ తర్వాత కాలక్రమేన 1920 డిసెంబర్ 23న సింగరేణి కాలరీస్ కంపెనీగా ఉద్భవించిందన్నారు. సింగరేణి కంపెనీ వల్ల కొన్ని వేల కుటుంబాలు బాగుపడ్డాయని, సింగరేణి పరిసర ప్రాంత ప్రజలకు వరమని తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 71.93 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందనీ, 65.26 మిలియన్ టన్నుల బొగ్గును వినియోగదారులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. వచ్చే ఐదు సంవత్సరాలలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా కంపెనీ ముందుకు సాగుతుందన్నారు. సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణలో భాగంగా థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టి దేశంలోనే అత్యుత్తమ ప్లాంట్లలో ఒకటిగా నిలవడం ఎస్టిపిపి ఉద్యోగులకు గర్వకారణమన్నారు. ప్లాంట్ ఆవరణలో మరో ఎనిమిది వందల మెగావాట్లు అల్ట్రా సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ ను నిర్మించుటకు బి.హెచ్.ఎల్ కంపెనీ కి నిర్మాణ బాధ్యతను అప్పగించడం జరిగిందన్నారు. పర్యావరణహిత కార్యక్రమాలలో భాగంగా చెట్లను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించడం జరుగుతుందన్నారు. ఫ్లూ గ్యాస్‌లను తగ్గించడానికి ఎఫ్జీడి ప్రాజెక్టు నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయని తెలియజేశారు. సింగరేణి ఉద్యోగులందరికీ ఈ సందర్భంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఈఈ (ఈ అండ్ ఎం) వాటర్ సిస్టం అండ్ వాటర్ మేనేజ్మెంట్ విభాగం ఈ.ఈ బేతి నాగరాజ, అకౌంట్స్ అండ్, ఫైనాన్సు అధికారి మోబిన్, సివిల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సురేష్ రెడ్డి, ఏరియా స్టోర్ విభాగం క్లర్క్ రవితేజలను శాలువాలతో సన్మానించి, సర్టిఫికెట్, బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం వెల్ బేబీ షో లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎం నరసింహారావు, (పిసిఎస్) (ఓ అండ్ ఎం) జి.ఎం మదన్మోహన్, సిఐఎస్ఎఫ్ కంమండంట్ చాంచల్ సర్కార్, సిఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంటు డి పంతులా, ఎజిఎం (ఫైనాన్సు) మురళీధర్, పవర్మేక్ ప్లాంట్ హెడ్ అచల్ కపూర్, పిఈఎస్ హెడ్ శర్మ, డిజీఎం (సివిల్) అజుల్లా ఖాన్ , 800మెగావాట్ల కోఆర్డినేటర్ వేణుగోపాల్, డిజీఎం (సి అండ్ ఐ) శివ ప్రసాద్ , డిజిఎం (పర్సనల్) కిరణ్ బాబు ఇతర అధికారులు, ఉద్యోగులు, మహిళలు, సిఐఎస్ఎఫ్ సిబ్బంది పవర్మేక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మొదటి సంతకంతో ఆడబిడ్డకు ఆర్థిక భరోసా

(మొదటిపేజీ తరువాయి)

అధికారికంగా ప్రమాణస్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే గ్రామానికి చెందిన శ్రీరామ రాకేష్ మహేశ్వరి దరతులకు ఆడబిడ్డ జన్మించిన సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తొలి సంతకాన్ని చెక్కుపై చేసి రూపాయలు 5116 నగదు చెక్కును ఆడబిడ్డ తండ్రి శ్రీరామ రాకేష్ కు అందజేశారు. ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయడం ద్వారా హామీలు మాటల్లో కాక చేతుల్లో చూపాలనే సందేశాన్ని సర్పంచ్ భక్తు రాంచందర్ స్పష్టంగా ఇచ్చారు. ప్రజాప్రతినిధి అంటే ఇదేనంటూ గ్రామస్తులు సైతం హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు. గ్రామ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తానని ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తానని ఈ సందర్భంగా సర్పంచ్ రాంచందర్ తెలిపారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా పాలన అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయంశంగా మారి నూతన ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిచింది.

## క్రీడల్లో గెలుపోటములు సహజం

**- బీజేపి సీనియర్ నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్**

కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 23, ప్రభాతవార్త

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతీ ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జిల్లా బీజేపి సీనియర్ నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీయం క్రీడా మైదానంలో మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో అరుణ్‌లోయ నిర్వహించిన మార్వాడి ప్రీమియర్ లీగ్ ఎంపిఎల్-2 క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన పరిందే టీం, రన్నర్ గా నిలిచిన బ్లాస్టర్ టీం లకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మార్వాడి యువ ముంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని, రానున్న రోజుల్లో మరిన్ని క్రీడలతో పాటు సేవలందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహావీర్ ప్రసాద్ లోయ, అరుణ్ జవర్, ఓం ప్రకాష్ లోయ, డా.పవన్ ముందడ, నిత్యప్రకాష్ జవర్ అరుణ్ అగ్రవల్, హరి సోని, బజాజ్ లోయ, సురేష్ లోయ, మనోజ్ సోని, వివేక్ బజాజ్, విక్కీ జైన్, మార్వాడి యువమంచ్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ అసావా, కోశాధికారి శుభం లోయ, కన్వీనర్లు మురళి జవర్, కపిల్ సోనీ, దినేష్ జవాన్, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష 2026కు దరఖాస్తుల ఆహ్వానం

**- దరఖాస్తుకు చివరి తేదీ జనవరి 21, ప్రవేశ పరీక్ష: 22 ఫిబ్రవరి**

**- మంచిర్యాల జిల్లా గురుకుల విద్యాలయాల సంస్థ డిసిఓ కోటూరి రామ కళ్యాణి వెల్లడి**

లక్షెట్టిపేట, డిసెంబర్ 23, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష 2026 ద్వారా 2026-27 విద్యా సంవత్సరానికి గాను, 5వ తరగతి, 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు (బ్యాక్లాగ్ వేకెన్సీస్) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు మంచిర్యాల జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ డిసిఓ కోటూరి రామ కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా, తెలంగాణ సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ రెసిడెన్షియల్ సంస్థల ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించబడతాయని తెలిపారు. ఉమ్మడిగా నిర్వహించే ప్రవేశ పరీక్ష వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 22 తేదీన.. ఆదివారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన బాలబాలికలు తేదీ: 21, జనవరి, లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫాములు, క్రీడా సామాగ్రితో పాటు ఐఐటి, నీట్, సియుఈటి వంటి జాతీయస్థాయి పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని డిసిఓ రామ కళ్యాణి తెలిపారు. దరఖాస్తులు పూర్తిగా ఆన్లైన్ విధానంలో స్వీకరించ బడతాయని అర్హత కలిగిన బాల బాలికల తల్లిదండ్రులు అధికారిక వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలు మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారము ఇవ్వబడతాయని తెలిపారు. అర్హత కలిగిన బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా డిసిఓ కోరారు.

## మట్టిలో మొదలైన జీవన పాఠం

**- రైతు విలువలను అనుభవంగా మార్చిన ఎథిక్ అకాడమీ రైతుల దినోత్సవం**

మంచిర్యాల, ప్రభాతవార్త



జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్, ఎథిక్ అకాడమీ స్కూల్‌లో రైతుల దినోత్సవాన్ని అత్యంత సృజనాత్మకంగా, అర్థవంతంగా నిర్వహించారు. ఈ వేడుక ఒక సంప్రదాయ కార్యక్రమంగా కాకుండా, విద్యార్థుల మనసులను తాకే జీవన పాఠంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం తరగతి గది నుంచి బయటకు వచ్చి ఒక చిన్న రైతు పొలంగా మారి ంది. విద్యార్థులు స్వయంగా మట్టిలోకి దిగి రేపరి నాటి, చేతులతో మట్టిని తవ్వు తూ వ్యవసాయం అంటే ఏమిటో అనుభవంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీ చరణ్ రెడ్డి మాట్లాడుతూ, రైతును గౌరవించడం అంటే మన జీవితాన్నే గౌరవించడం. పిల్లలు ఈ రోజు మట్టిని తాకి వ్యవసాయా న్ని అనుభ వంగా నేర్చుకున్నప్పుడు, రేపటి బాధ్యతగల పౌరులు అవుతారు. విద్య అనేది పుస్తకాలకే పరిమితం కాకుండా జీవన విలువలను నాటాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ రెడ్డి, ఉపాధ్యాయులు మరియు సిబ్బ ంది అందరూ చురుకుగా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యతో పాటు శ్రమ విలువ, ప్రకృతి పట్ల గౌరవం, రైతుల పట్ల కృతజ్ఞత భావాన్ని పిల్లల్లో పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. జన్మభూమి నగర్, మంచిర్యాలలో ఎథిక్ అకాడమీ స్కూల్‌లో నిర్వహించిన ఈ రైతుల దినో త్సవ వేడుక విద్యను జీవితంతో అనుసంధానించిన ఒక ఆదర్శ కార్యక్రమంగా నిలిచింది.

# ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలకు రాష్ట్రస్థాయి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉత్తమ విద్యాసంస్థగా అవార్డు

### - అవార్డు అందుకున్న ప్రిన్సిపల్ అవునూరి అంజయ్య

**బెల్లంపల్లి, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి ఒక కళాశాల చొప్పున 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఎంపిక చేసి నిర్వహించిన సర్వేలో అన్ని కళాశాల కెల్ల ప్రభుత్వ ఉత్తమ విద్యా సంస్థగా బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలకు రాష్ట్రస్థాయిలో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉత్తమ విద్యా సంస్థగా అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం రోజున హైదరాబాద్ లోని నోవాటెల్ హోటల్ లో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అవునూరి అంజయ్యకు అవార్డును మల్లారెడ్డి విశ్వ విద్యాపీట్ వారు అందజేశారు. ప్రిన్సిపల్ వెంట అధ్యాపకులు కృష్ణవేణి, తిరుమలదేవి, చంద్రయ్యలు ఉన్నారు. కాగా మల్లారెడ్డి విశ్వ విద్యాపీట్ సమర్పించిన హై బిజ్ టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరానికి గాను ఈ అవార్డును బెల్లంపల్లి ప్రభుత్వ కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలకు అందజేసినట్లు ముల్లారెడ్డి విశ్వ విద్యపీట్ వారు ప్రకటించారు. సామర్థ్యాల పెంపు, కళాశాల నిర్వహణ, ఉత్తమ ఫలితాల సాధన, ఉత్తమ విద్యా బోధన, అధ్యాపకులు సిబ్బంది పనితీరు ఉత్తమంగా ఉందని అన్ని కోణాలను పరిశీలించి గుర్తించి ఉత్తమ విద్యాసంస్థ అవార్డును బెల్లంపల్లి ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలకు ఇవ్వడం జరిగిందని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అవునూరి అంజయ్య మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో అంకిత భావంతో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది అందించిన సహకారం, వారు చేసిన కృషి, తమ కళాశాలలో అభ్యసిస్తున్న విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం కారణంగానే బెల్లంపల్లి ప్రభుత్వ కో



మల్లారెడ్డి విశ్వ విద్యాపీట్ వారు ప్రిన్సిపల్ అవునూరి అంజయ్యకు అవార్డును అందజేస్తున్న దృశ్యం

ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు రావడం జీవితంలో మర్చిపోలేని సందర్భం అన్నారు. అన్ని విషయాల్లో రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కే. అంజయ్యలు కళాశాలకు వెన్నంటి ఉండి ప్రతివిషయంలో ప్రోత్సహించడం, సహాయసహకారాలు అందించడం ద్వారానే ఈ అవార్డు వచ్చిందన్నారు. ఇందుకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ప్రిన్సిపల్ అంజయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్రలో ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలకు ఉత్తమ అవార్డు రావడం ఇదే ప్రధమం.



## ధనుర్మాస మహా పాదయాత్రను విజయవంతం చేయండి

### - హిందూ ఉత్సవ కమిటీ మంచిర్యాల

**మంచిర్యాల, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

ధనుర్మాసం సందర్భంగా లోక కళ్యాణార్థం మంచిర్యాల జిల్లా కేంద్రంలో డిసెంబర్ 25న ఉదయంసమయం 8గంటలకు హమాలీవాడ శ్రీ శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయం నుండి బొక్కలగుట్ట ఋష్యముఖ పర్వతం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని, గత 3 సంవత్సరాల నుండి ఈ పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, హిందూ ఉత్సవ సమితి మంచిర్యాల ఆధ్వర్యంలో సుమారు 12 కిలోమీటర్ల మహా పాదయాత్ర నిర్వహించబడుతుందని తెలిపారు. మంగళవారం రోజు ప్రభుత్వ బాలుర పాఠశాల యందు దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓం అష్టోత్తర యోగ పీట్ సభ్యులు, ఫిట్నెస్ సెంటర్ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పాల్గొని విజయవంతం చేయాలనీ హిందూ ఉత్సవ సమితి కార్యదర్శి కర్ణకంటి రవీందర్, కోశాధికారి ముస్యల కృష్ణ, విశ్వేశ్వర్ శర్మ, సభ్యులు కండె బద్రి నారాయణ,నాగారపు సంతోష్, రమేష్ యాదవ్, మల్యాల రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పర్వతం చుట్టూ గోమాతతో గిరిప్రదక్షిణ చేయబడునని, హిందూ బాంధవులందరూ పెద్ద ఎత్తున పాల్గొనిఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని వినమ్రంగా కోరారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రఘునాథ్

## యువతను క్రీడల్లో ప్రోత్సహిండానికే ప్రతి ఏడాది క్రికెట్ టోర్నమెంట్

### - రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

**మంచిర్యాల, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

భారత రత్న స్వర్గీయ అటల్ బిహారీ వాజపేయి జయంతి సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ అటల్ బిహారీ వాజపేయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ అటల్ బిహారీ వాజపేయిని స్పూర్తిగా తీసుకుని యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏడాది ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి యువత చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా జీవిత లక్ష్యం పై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అటల్ బిహారీ వాజపేయి జీవితాన్ని స్పూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాజుల ముఖేష్ గౌడ్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, బియ్యాల సతీష్ రావు, బెల్లంకొండ మురళి, మెరెడికొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మహామండల పూజా మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

**మందమర్రి, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని హరిహర దేవస్థానంలో నిర్వహించనున్న మహా మండల పూజా మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను అయ్యప్ప స్వాములు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ గురుస్వామి మాట్లాడుతూ, డిసెంబర్ 26 సాయంత్రం అయ్యప్ప స్వామి ఆలయం నుండి పట్టణ ప్రధాన వీధుల గుండా స్వామివారి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం డిసెంబర్ 27 ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమై, స్వామివారికి వివిధ రకాల ఫలాలతో విశేష అభిషేకం, అమ్మవారి చీరల వేలం, భిక్షా కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. సాయంత్రం కేరళకు చెందిన సంజీవ్ నముద్రి ఆధ్వర్యంలో మహా మండల పూజతో పాటు అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పవిత్ర కార్యక్రమాల్లో భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని గురుస్వామి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హరిహర దేవస్థాన కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న అయ్యప్ప స్వాములు



## సింగరేణి ఆవిర్భావ వేడుకల బహిష్కరణ, నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

### - ఉత్సవాల నిధుల్లో యాజమాన్యం భారీగా కోత

### - ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గనుల వద్ద ఆందోళన

**నస్పూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

సింగరేణి యాజమాన్యం సంస్థ ఆవిర్భావ వేడుకలను నామమాత్రంగా నిర్వహించడాన్ని నిరసిస్తూ గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పూర్తిగా బహిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్.కే. బాజీ సైదా మాట్లాడుతూ.. సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని గతంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఒక పండగలా అత్యంత వైభవంగా జరుపుకునేవారని గుర్తు చేశారు. కానీ, ఈ ఏడాది ఉత్సవాల నిధుల్లో యాజమాన్యం భారీగా కోత విధించడం దారుణమన్నారు. గతంలో శ్రీరాంపూర్ ఏరియాలో వేడుకల కోసం 3 లక్షల 60 వేల రూపాయల నిధులు కేటాయించేవారని, ఆ నిధులతో కార్మిక కుటుంబాలకు ముగ్గుల పోటీలు, ఆటలు నిర్వహించి ఉత్తమ కార్మికులకు బహుమతులు అందించేవారని తెలిపారు. దీనికి విరుద్ధంగా ఈ ఏడాది కేవలం 60 వేల రూపాయలతో నామమాత్రంగా వేడుకలు ముగించాలనుకోవడం సరి కాదని వారు ధ్వజమెత్తారు. సంస్థకు సంబంధం లేని కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న యాజమాన్యం, సంస్థకు వెన్నెముకగా ఉన్న కార్మికుల కోసం జరుపుకునే ఆవిర్భావ వేడుకలకు నిధులు కేటాయించకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. అందుకే గుర్తింపు సంఘంగా తాము ఈ వేడుకలను బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, సంపత్, నాగభూషణం, పిట్ కార్యదర్శులు దాడి రాజయ్య, మురళీ చౌదరి, మోతే లచ్చన్న, నవీన్ రెడ్డి, గునిగంటి నరసింహారావు, మారపల్లి సారయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

## 50 శాతం రిజర్వేషన్లు ఎత్తివేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి

**మంచిర్యాల, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం 50 శాతం సీలింగ్ రిజర్వేషన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం సీసీసీ కార్నర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా మేము ఎంతో మాకంత వాటాకై ఉద్యమాలు నడుస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ల దాటొద్దని తీర్పును బూచిగా చూపిస్తుందని,రాజ్యాంగంలో ఎక్కడ 50 శాతం రిజర్వేషన్లు దాటరాదు అని ఎక్కడ లేదని, సుప్రీంకోర్టు జడ్జీలు నలుగురు కలిసి తీసుకున్న నిర్ణయం మాత్రమే అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లతో 50 శాతం సీలింగ్ దాటింది దానికి ఏ సీలింగ్ అడ్డురాదు రాజ్యాంగ సవరణ ద్వారా 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేసి విద్యా ఉద్యోగ స్థానిక సంస్థలలో చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజ్జల్లి వెంకటయ్య, శాఖపూడి భీమ్ సేన్, చంద్రగిరి చంద్రమోళి, అంకం సతీష్, రామగిరి రాజన్న చారి, ధర్మాజీ మల్లేష్ చెలిమెల అంజయ్య, వేముల కిరణ్ చీరాల తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## కాంగ్రెస్ కార్యకర్తల అంతిమయాత్రలో పాల్గొన్న ఇందారం సర్పంచ్

జైపూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త



ఇందారం గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కాంగ్రెస్ కార్యకర్త తంగళ్లపల్లి శంకర్ గుండె పోటుతో మృతి చెందారు. మంగళవారం శంకర్ అంతిమయాత్రను నిర్వహించగా నూతన సర్పంచ్ మహమ్మద్ ఫయాజ్ హాజరై నివాళులర్పించి, శంకర్ పాడెను మోసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. శంకర్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఫయాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కుల మత బేధాలు లేవన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీకి పట్టు కొమ్ములు అని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు అన్ని వేళల్లో అండగా ఉంటామని అన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి

రామకృష్ణాపూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త



పట్టణంలోని శాంతినగర్ కాలనీ (ఆర్.కె 4 గడ్డ) ప్రాంతంలో మైనింగ్ కార్యకలాపాల వల్ల స్థానిక ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలపై మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్‌కు కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనింగ్ బ్లాస్టింగ్స్ వల్ల ఇళ్లు దెబ్బతింటున్నాయని, కాలుష్యం వల్ల ఆరోగ్యం పాడవుతోందని వారి దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ నిర్వహిస్తూ ప్రజా భద్రతను విస్మరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. బాధిత ఎస్సీ, ఎస్టీల తరఫున కమిషన్‌లో స్వయంగా కేసు వేస్తానని, పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## హెచ్‌ఎంఎస్ నూతన వైస్ ప్రెసిడెంట్ పరిచయ కార్యక్రమం

**- ముఖ్యాధితులుగా విచ్చేసిన రియాజ్ అహ్మద్**

**- కేకే ఓసీపీ బాధితులు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్న రియాజ్**

మందమర్రి, డిసెంబర్ 23, ప్రభాతవార్త

మందమర్రి ఏరియా హెచ్‌ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన బెడ్డల విజయ్ కుమార్ పరిచయ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, ఎస్ఓటూ జీఎం, పర్సనల్ మేనేజర్ అశోక్, ఐఈడీ ఇంజనీర్ కిరణ్‌లకు యూనియన్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ పరిచయం చేశారు. కేకే ఓసీపీలో పనిచేస్తున్న 80 మంది కార్మికులకు హౌస్ రెంట్ అలవెన్స్ రావడం లేదని రియాజ్ అహ్మద్‌కి బాధని మొర పెట్టుకున్నారు. గతంలో ఎన్నో యూనియన్స్, మేనేజ్మెంట్‌కి ఎన్ని సార్లు మొర పెట్టుకున్న పట్టించుకున్న వారు లేరు అని, తమకు రావలసిన న్యాయమైన హక్కుని ఎలాగైనా ఇప్పించాలని కోరారు. దీనికి వెంటనే స్పందించిన రియాజ్ అహ్మద్ మేనేజ్మెంట్‌తో మాట్లాడి కార్మికులకు న్యాయమైన సమస్యను పరిష్కరించే విధంగా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రిజినల్ ఇంచార్జ్ వెల్ది సుదర్శన్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, భువన చంద్ర, సెంట్రల్ సెక్రెటరీ హరీష్ యాదవ్ నాయకులు నేరేటి కార్తీక్, పుల్లూరి మహేష్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.





కార్యక్రమంలో మాట్లాడుతున్న జిఎం రాధాకృష్ణ



# ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సింగరేణికి 105 ఏళ్లు, గ్లోబల్ కంపెనీగా ఎదుగుదల - మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ**

మందమర్రి, డిసెంబర్ 23, ప్రభాతవార్త

మందమర్రి ఏరియా కార్యాలయంలో సింగరేణి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం కేక్ కట్ చేసి అందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ బొగ్గు డ్రిల్ చేస్తున్న కార్మికులతో కూడిన ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చిహ్నం కలిగి ఉన్న సింగరేణి పతాకం, రాష్ట్ర, దేశ సరిహద్దులు దాటి అంతర్జాతీయ యవనికపై రెపరెపలాడనుంది. అంతటి ఘన చరిత్ర సాధించిన కంపెనీ, 105వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకుంది. ఉత్స వాల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వారం రోజులుగా ఏరియాలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. తెలంగాణ లోని ఖమ్మం జిల్లా ఇల్లందులో 1871 లో అప్పటి బ్రిటిష్ అధికారి డాక్టర్ విలియం కింగ్, మొట్టమొదట బొగ్గు బంగారాన్ని కనుగొనగా, అటు తర్వాత 1886లో ఇంగ్లాండ్ లో ది హైదరాబాద్ దక్కన్ కంపెనీ లిమిటెడ్ కు బొగ్గు తవ్వకాలు చేసుకునే హక్కులు కల్పించబడ్డాయి. ఆ తర్వాత 1920 డిసెంబర్ 23న హైదరాబాద్ కంపెనీ చట్టం ప్రకారం పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా, ది సింగరేణి కాలరీస్ కంపెనీగా మార్చుకొని, ఏటా ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటుంది. కంపెనీలో కేంద్రం 49 శాతం, 51 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగుతూ, 11 ఏరియాలలో 17 ఉపరితల బొగ్గు గనులు, 22 అండర్ గ్రౌండ్ గనులు, సుమారు 40 వేల కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల కుటుంబాలకు జీవనోపాధిగా, విద్యుత్, సిమెంట్, ఇతర పారిశ్రామిక రంగాలకు బొగ్గు సరఫరా చేస్తూ, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తూ, తెలంగాణ కొంగుబంగారంగా కొనియాడ పడుతున్నది. సింగరేణి కంపెనీ అంటే బొగ్గు ఉత్పత్తి చేయడమే కాదు అనే విధంగా ఇతర రంగాల్లోకి సైతం విస్తరిస్తున్నది. కంపెనీ అవసరాలతో పాటు మార్కెటింగ్ చేయడానికి విద్యుత్ రంగంలో అడుగుపెట్టి నాణ్యమైన కరెంటును అందిస్తూ భేష్ అనిపించుకున్నది. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం, అక్కడే మరో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటు, ఒడిస్సా లోని నైని బొగ్గు ఉత్పత్తి తీస్తుండగా, 2400 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. థర్మల్ విద్యుత్ కేంద్రాలతో పాటుగా, కంపెనీ స్థలాలు, మూతపడిన ఓసి లపై సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నది. కొత్త ఆలోచనలతో నీటి పై సోలార్, థర్మల్, పవన పద్ధతుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది, చేయనుంది. బొగ్గు ఉత్పత్తితో పాటు కార్మిక సంక్షేమం, భద్రతకు అనేక చర్యలు తీసుకుంటుంది. విద్య, ఉపాధి కల్పన రంగాలను బలోపేతం చేస్తుంది. తెలంగాణకు మా కుటుంబ లేని మహా కంపెనీగా ఎదుగుతుంది.

### కొత్త బొగ్గు గనులు ఏర్పాటు అవసరం...

గ్లోబల్ కంపెనీగా ఎదుగుతున్న సింగరేణి, 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించేందుకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కొత్త గనుల ఏర్పాటు అవసరం ఉంది, పాత గనుల జీవితకాలం ముగుస్తుండడం వలన అవి మూతపడి పోతున్నాయి. వాటి స్థానంలో కొత్తగా ఏర్పాటు లేక భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బొగ్గు గనుల టెండర్ విధానం ఇరకాటకంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పద్ధతుల వైపు ఆలోచన చేయడం, కార్మిక సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వ సహకారం చాలా అవసరం ఉంటుంది. వందేళ్ళకు పైగా చరిత్ర గల బొగ్గు కంపెనీ, లక్షకు పైగా కార్మికులు ఉన్న సంస్థలో గనులు, కార్మికులు తగ్గిపోయారు. అయితే ఇతర రంగాల వైపు యాజమాన్యం ఆలోచన చేయడాన్ని కార్మికులు హర్షిస్తున్నప్పటికీ, బొగ్గు తవ్వకాల కోసం గనుల ఏర్పాటుపై కూడా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పలువురు కార్మికులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి గ్లోబల్ దిశగా వేస్తున్న అడుగులు విజయవంతం కావాలని, కొత్త గనులు ఏర్పాటు అవుతాయని కార్మికుల లోకం ఆశిస్తుందని అన్నారు. ఉద్యోగుల శ్రమతోనే బొగ్గు వెలికి తీసే స్థాయి నుండి ప్రపంచ దేశాలతో దీటుగా అత్యాధునిక యంత్రాలను ఉపయోగించే స్థాయికి సింగరేణి చేరుకుందని, దేశాలలోని బహిరంగ గనులలో అన్ని బొగ్గు గనులకు దీటుగా సింగరేణి సంస్థ పని చేస్తుందని అన్నారు. సింగరేణి ఉత్పత్తి మాత్రమే ధ్యేయంగా కాకుండా చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి కూడా బాధ్యతగా పనిచేస్తుందని తెలియజేశారు. ఈ సింగరేణి వేడుకలు ఇంత ఘనంగా జరగడం ఎంతో సంతోషంగా ఉందని ముఖ్య అతిథులు తెలియజేశారు. ఈ సంవత్సరం 2025-26, ఏప్రిల్ 2025 నుంచి 17 డిసెంబర్ 2025 వరకు కంపెనీ మొత్తానికి నిర్దేశించిన ఉత్పతి లక్ష్యం 48.34 మెట్రిక్ టన్నులు కాగా 41.11 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేసి 85 శాతం సాధించామని అన్నారు. మార్కెట్లో మనం ఈ పోటీ పరిస్థితిని ఎదుర్కొని నిలబడాలంటే మన ఉత్పత్తి వ్యయం భారీగా తగ్గించుకోవాలని యంత్రాలను మనం ప్రతి షిఫ్ట్ లో పూర్తి పనిగంటలు వినియోగించి ఉత్పత్తి సాధించాలని, ఈ విషయంపై మనం ప్రతి మల్టీ డిపార్ట్మెంట్ టీం సమావేశాల్లోనూ గనుల మీద చెప్తూనే ఉన్నామని పనిగంటలు కొంత మెరుగైనప్పటికీ ప్రతి షిఫ్ట్ లో కార్మికుల పనిగంటలు యంత్రాల పనిగంటలు ఇంకా పెరగాల్సి ఉందని అప్పుడే మనం ఉత్పత్తి వ్యయం తగ్గించుకోగలుగుతాం అని అన్నారు. మందమరి ఏరియాలో 5976 మంది రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డు ద్వారా రూపాయలు ఎనిమిది లక్షల కార్పొరేట్ వైద్య బీమా సదుపాయం మన కంపెనీ అందిస్తుందని వారు అన్నారు. ఉద్యోగులు సొంతగృహ నిర్మాణానికి తీసుకున్న పది లక్షల రుణం మీద చెల్లించే వడ్డీని కంపెనీ ఏ చెల్లిస్తోందనిహ ఇప్పటివరకు 570 మందికి ఇంటి రుణం పై వడ్డీ చెల్లించామని వారు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మందమరి ఏరియాలో 110 మెగావాట్ల సౌర విద్యుత్ శక్తిని కూడా ఉత్పత్తి చేస్తున్నామని వారు అన్నారు. మనం - మన కోసం, మన కంపెనీ కోసం, మన రాష్ట్రం కోసం, పనిచేస్తున్నాము అనే భావాన్ని మనసా వాచా కర్మణా ఆచరిస్తూ సమిష్టిగా కృషి చేస్తూ మన కంపెనీకి మంచి పేరును బంగారు భవిష్యత్తును అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియాలో ఉత్తమ అధికారులు మరియు ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం సింగరేణి హై స్కూల్ విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ, ఎస్.ఓ.టు జి.ఎం జి.ఎల్ ప్రసాద్, సీఎంఓఏఐ మందమర్రి అధ్యక్షులు రమేష్, మందమర్రి ఏరియా డీజీఎం పర్సనల్ అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, జనరల్ మేనేజర్ కార్యాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది, అన్ని గనుల ఉన్నతాధికారులు, సిబ్బంది, కార్మికుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**- ప్రపంచ మానవాళికి శాంతి మార్గాన్ని చూపిన ఏసుక్రీస్తు - ప్రిన్సిపాల్ ఎం.రమేష్**

మందమర్రి, డిసెంబర్ 23, ప్రభాతవార్త



మందమర్రి పట్టణ కేంద్రంలో గల శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎం.రమేష్ మాట్లాడుతూ ప్రపంచ మానవళికి శాంతి మార్గాన్ని చూపిన ఏసుక్రీస్తు శత్రువుని ప్రేమించాలని ఏ పరిష్కారమైన శాంతితోనే పరిష్కారం కనబడుతుందని, అన్ని మతాలను గౌరవించాలనే ఉద్దేశంతో పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించామని ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు వివిధ క్రిస్మస్ పండుగ వేషాధారణలతో అలరించి, క్రిస్మస్ పాటలపై నృత్యాలు చేశారు. అనంతరం చిన్నపిల్లలతో ప్రిన్సిపాల్ ఎం.రమేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు కేక్ కట్ చేయించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వీరిని పాఠశాల యాజమాన్యం డైరెక్టర్ శ్రీవిద్య, చైర్మన్ మల్లంపల్లి శ్రీధర్, ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజులు అభినందించారు. ఈ కార్యక్రమంలోపాఠశాల డీన్ రవి, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇంచార్జిలు నూకల సునీత, తిరుమల ప్రీ ప్రైమరి, ఉపాధ్యాయులు హెప్సిబా, సునీతా, మంగ దేవి, లావణ్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో

**బెల్లంపల్లి, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీబెల్లంపల్లి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలవేసి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తూట్లు పొడిచి మహాత్మా గాంధీ పేరును తొలగిస్తూ వికసిత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గర్ అండ్ అజీవిక మిషన్ విబిజిరామ్‌జిగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ మహాత్మా గాంధీ కూడలి వద్ద రాస్తారోకో ధర్నా చేయడం జరిగింది. సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి మాట్లాడుతూ ఈ దేశంలో పేద ప్రజలు చేయడానికి పనులు లేక జీవించడానికి తిండి లేక అనేకమంది ఆకలి చావులకు గురైనారు. ప్రజల ఆకలి మరణాలకు స్వస్తి పలకాలని వారు జీవించడానికి పనులు కల్పించాలని 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కమ్యూనిస్టు నాయకులు పార్లమెంట్లో మాట్లాడి ప్రభుత్వాన్ని ఒప్పించి మాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడం జరిగినది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతం ద్వారా ఈ పథకము ప్రవేశపెట్టినారు. ఈ పథకం వల్ల చాలామంది పేద ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. దీనివలన ఎంతోమంది ఆకలి చావుల నుండి రక్షించబడినారు. అట్టి పథకానికి ప్రస్తుతం ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి మోదీ ఈ పథకానికి తూట్లు పొడుస్తూ ఈ పథకాన్ని నిర్వీర్యపరిచి కొత్త పేరుతో పథకాన్ని తీసుకువచ్చి పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేటు చేస్తూ సంపన్నులను ఇంకా సంపన్నులు చేస్తూ ప్రజా కంటక ప్రభుత్వముగా మారిపోయినది. కావున ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితంగా ప్రజా ఉద్యమాలు చేయవలసిన అవసరం ఉన్నది. కేంద్ర ప్రభుత్వము తీసుక వచ్చిన ఈ కొత్త పథకాన్ని రద్దు పరుస్తూ పాత పథకమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఇదే పేరుతో కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శిలు బొంతల లక్ష్మీనారాయణ, కొండు బానేష్ జిల్లా సమితి సభ్యులు తిలక్ అంబేద్కర్, డిఆర్ శ్రీధర్, రత్నం రాజం, బి కే యం యు జాతీయ సమితి సభ్యులు అక్కెపల్లి బాపు, జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జాడి పోశం, నాయకులు బొంకూర్ రామచందర్, బియ్యాల ఉపేందర్, దాగం రాజలింగు, ప్రహల్లాద, కృషింగు హనుమంతు, పులి శంకర్, మహేందర్ రెడ్డి, సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న దాగం మల్లేష్



## విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

**నార్నూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

రానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు, స్టడీ హాల్స్ నిర్వహించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ అన్నారు. మంగళవారం గణేష్ కుమార్ నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించి అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ధన్రాజ్, బాలాజీ కాంబ్లే పాల్గొన్నారు.



## నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేయాలి

**నార్నూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

ప్రభుత్వం చేపడుతున్న ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి వాఘ్మారే విజయ్ కుమార్ అన్నారు. ఆయన మంగళవారం నార్నూర్ మండలంలోని మలంగి, మాలేపూర్ గ్రామాల్లో గొర్రెలు, మేకలు డీవార్మింగ్ చేశారు. మొత్తం 450 పశువులకు డీవార్మింగ్ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాధవ్, వెటర్నరీ ప్రాక్టీషనర్ మస్కే సునీల్, అంతర్పుల శ్రీకాంత్, జితేందర్, చంటి పాల్గొన్నారు.

## ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు

**సారంగాపూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలం కౌట్ల(బి) గ్రామంలోని నేతాజీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల చేత రైతు ప్రాముఖ్యత గురించి నాటకాలు వేయించారు. పిల్లలు రైతు దేశానికి వెన్నెముక్క అని తెలియజేస్తూ మంచి నాటక ప్రదర్శన చేశారు. నాటక ప్రదర్శన చూసి పిల్లలను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులు అభినందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదు, రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ప్రజలకు కావలసిన ఆహార పదార్థాలు, వ్యవసాయ ఆధారిత వర్తక, వ్యాపారం కొనసాగడానికి, దేశాభివృద్ధికి రైతు వెన్నెముక్కగా నిలవడం జరుగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## రాజురా పాలకవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే

**నేరడిగొండ, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండలంలోని రాజురా గ్రామంలో బాధ్యతలు స్వీకరించిన గ్రామ పంచాయతీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుమెంబర్లు గ్రామ అభివృద్ధి కొరకు పాటు పడాలని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరోజి, ఉపసర్పంచ్ రాథోడ్ బాపురావ్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు, నాయకులు దేవేందర్ రెడ్డి, సవాయి, రవి, ప్రీతం రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటపూర్ సర్పంచ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

**నేరడిగొండ, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండలంలోని వెంకటపూర్ నూతన సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసిన రూపవత్ వెంకట్ రామ్, ఉపసర్పంచ్ మురళి కృష్ణ, నూతన కార్యవర్గాన్ని మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్, ఉపసర్పంచ్, నూతన కార్యవర్గం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, చిత్తశుద్ధితో పని చేసి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు.





## నట్టల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నేరడిగొండ, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేకలు, గొర్రెలకు ఉచిత సామూహిక నట్టల నివారణ కార్యక్రమానికి నెరడిగొండ మండలంలోని రాజురా గ్రామంలో మంగళవారం ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మంగళవారం నుంచి జనవరి 2వ తేదీ వరకు నెరడిగొండ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉచిత శిబిరాలు జరుగుతాయని, మేకలు, గొర్రెలు ఉన్నవారు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## మొక్కులు తీర్చుకున్న జాం సర్పంచ్ మిత్ర బృందం

**సారంగాపూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

మండలంలోని జాం గ్రామ సర్పంచ్‌గా కరిపే రవళి విలాస్ గెలవాలని మొక్కకున్న సర్పంచ్ మిత్రమండలి గెలిచిన సందర్భంగా వివిధ దేవాలయాలలో తమ మొక్కులు తీర్చుకున్నారు. తిరుమలచారి అనే మిత్రుడు జాం గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో, దాసరి ప్రశాంత్, కిట్టు, వెంకీ, అనిల్, పివి కొండగట్టు అంజన్న స్వామిని దర్శనం చేసుకుని, మరో మిత్రుడు జాం నుండి పాదయాత్రగా బసవేశ్వర దేవాలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మిత్రమండలి సభ్యులు మాట్లాడుతూ విలాస్ గెలుపు కోసం నిరంతరంగా కృషి చేశామని అన్నారు. గ్రామాభివృద్ధిలో అన్ని రకాలుగా విలాస్‌కి సాహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు.

# మీ డబ్బు మీ హక్కు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 23,ప్రభాతవార్త:**

ప్రజలు మీ డబ్బు మీ హక్కు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకర్లు, ఖాతాదారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీ డబ్బు మీ హక్కు అని, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 10 సంవత్సరాల కంటే పైగా బ్యాంకులలో ఖాతాలు కలిగి ఉండి నేటి వరకు డబ్బు క్లెయిమ్ చేసుకోని వారి కొరకు ఈ నెల 1వ తేదీ నుండి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 65 వేల ఖాతాలు ఇలాంటివి ఉన్నాయని, ఈ ఖాతాలలో రూ. 15.76 కోట్ల జమ కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు 254 ఖాతాల వారు 1.34 కోట్ల రూపాయలు క్లెయిమ్ చేసుకున్నారని, జిల్లాలోని ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. గ్రామాలలో సర్పంచులను సమన్వయం చేసుకోవాలని, బ్యాంకులు గ్రామాల వారీగా క్లెయిమ్ చేసుకోని వారి వివరాలతో జాబితా తయారుచేసి అందించాలని తెలిపారు. అధికారులు, మెప్మా, సెర్ప్, స్వయం సహాయక సంఘాలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా క్లెయిమ్ చేసుకున్న వారికి ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాలసూచికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం వీరభద్రుడు, మంచిర్యాల, ఆదిలాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్లు, బ్యాంకు మేనేజర్లు, ఐకెపి, మెప్మా సిసి లు, ఎపిఎం లు, ఖాతాదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## అయ్యప్ప మండల మహా పడిపూజ కరపత్రాలు ఆవిష్కరణ

**ఆసిఫాబాద్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్ద వాగు సమీపంలోని శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈ నెల 27న నిర్వహించనున్న అయ్యప్ప మండల మహా పడిపూజ మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ్ర స్వాములతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరగనున్న మహా పడిపూజ, అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్వాములు, భక్తులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వాములు వెంకటగౌడ్, చంద్రమోహన్, మోహన్, బట్టు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జిఎం విజయభాస్కర్ రెడ్డి

## ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

**- బెల్లంపల్లి ఏరియా జిఎం విజయభాస్కర్ రెడ్డి**

**తాండూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**

సింగరేణిలో పనిచేసే ప్రతి ఉద్యోగి, కార్మికుడి సంక్షేమం కోసం యాజమాన్యం పెద్దపీట వేస్తోందని బెల్లంపల్లి ఏరియా జిఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గోలేటిలోని జీఎం కార్యాలయం ఆవరణలో మంగళవారం సింగరేణి ఆవిర్భవ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రాబోయే రోజులలో బెల్లంపల్లి ఏరియాకు వంద శాతం పూర్వ వైభవం వస్తుందని పేర్కొన్నారు. గోలేటి, ఎం.వీ.కే. ఓపెన్ కాస్టు లు త్వరలో ప్రారంభమవుతాయాన్నారు. నూతన ఓపెన్ కాస్టులతో బెల్లంపల్లి ఏరియాకు 30 నుంచి 40 ఏళ్ల భవిష్యత్తు ఉంటుందన్నారు. 2025-26 వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని కోరారు. సింగరేణి అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్ఓటు జిఎం నరేందర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఉట్నూర్ సర్పంచ్‌కి సన్మానం

**ఉట్నూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**

ఉట్నూర్ సర్పంచ్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించి అనిత శ్రీనివాస్ గారిని వారి స్వగృహంలో సోషల్ మీడియా జిల్లా నాయకులు బాబా శ్యామ్ టైగర్ గారితో కలిసి బిఆర్ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్యే మా లక్ష్యం అని గ్రామం కోసం మీ సేవకులుగా పని చేస్తామని అన్నారు. పారదర్శక పాలన సమాన అభివృద్ధిగా పని చేస్తామని కోరారు.ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తామని ప్రతి కుటుంబానికి మేలు చేసేలా గ్రామంలోనే ఉంటూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉండి కష్టపడి పని చేస్తామని తెలిపారు.మీ సహాయ సహకారాలు అందించాలని కోరారు.





నామినీకి బీమా చెక్కు అందజేస్తున్న మేనేజర్ విశ్వేశ్వరరావు

## నామినీకి రూ.2లక్షల బీమా చెక్కు అందజేత

**తాండూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**

తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త గుడిసెలకు చెందిన ఒడ్నాల శంకర్ కు మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ విశ్వేశ్వరరావు అందజేశారు. మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారురాలైన ఒడ్నాల లక్ష్మి ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకంలో బీమా చేయించారన్నారు. లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిందన్నారు. దీంతో లక్ష్మి నామినీ అయిన శంకర్ కు బీమా డబ్బులు మంజూరయ్యాయన్నారు. ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.2 వేలతో పాలసీ తీసుకుంటే ప్రమాద మరణం జరిగితే నామినీకి రూ.40 లక్షల భీమ పరిహారం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది కోటేశ్వర్, ప్రణిత, సూర్యకాల,నిర్మల, సి ఫ్ ల్ కౌన్సిలర్ రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి కృషి చేయాలి

**- సిపిఎం మండల కార్యదర్శి దాగం రాజారాం**

**తాండూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**

రైతు సంక్షేమం కోసం పాలకులు కృషి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి దాగం రాజారం అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిరైతన్న తలరాత మారడం లేదన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు మీటింగ్లలో రైతే రాజు అని రైతులను పొగుడుతూ ఉంటారే కానీ వారి బాగోగులు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. గత కేంద్ర ప్రభుత్వం భారతదేశంలోని రైతుల సమస్యలు తెలుసుకుని నివేదిక ఇవ్వాలని ఒక కమిటీని నియమించిందని, ఆ కమిటీ నివేదికను ప్రభుత్వానికి ఇస్తే రైతుల సమస్యలు ఒకటైన నెరవేర్చలేదని ఆరోపించారు. ఇప్పటికైనా పాలకులు రైతుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు వేల్పుల శంకర్, బోల్లం రాజేశం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి దాగం రాజారాం



## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి: ఎంఈఓ

**పెంచికల్ పేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి రమేష్ బాబు ఆధ్వర్యంలో కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమేష్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని పాఠశాలలకు సమయానికి హాజరై బోధన కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని అందువల్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలని అన్నారు. అలాగే పాఠ్యప్రణాళిక ప్రకారం బోధన, విద్యార్థుల అభ్యాస ఫలితాలపై ప్రత్యేక శ్రద్ధ, నూతన బోధన పద్ధతిలో వినియోగం అవసరమని తెలిపారు. విద్యార్థులలో హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులతో సమన్వయం పెంచాలని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

## పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన

**బెజ్జూర్,డిసెంబర్ 23,ప్రభాతవార్త:**

బెజ్జూర్ పోలీసుల అధ్వర్యంలో మంగళవారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నీతికాపంత్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మారుతున్న టెక్నాలజీతో మోసగాళ్లు చెలరేగిపోతున్నారన్నా రని, అప్రమత్తంగా ఉంటేనే నష్టం నుంచి తప్పించుకోవచ్చని ఎస్ఐ సర్తాజ్ పాషా అన్నారు.ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో వాట్సప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని,సైబర్ నేరాల్లో విద్యావంతులే అధికంగా మోసపోతుండడం బాధాకరమన్నారు.మల్టీలెవల్ మార్కెటింగ్,ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్,ఇతర ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో లేదని,ఏ పోలీస్ అధికారి నేరుగా వాట్సప్ వీడియోకాల్స్ చేయరని,డిజిటల్ అరెస్టులు అని ఎవరైనా కాల్స్ వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్లకు బలంగా మారాయన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే తక్షణమే 1930లో ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సరిత,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



కైరిగూడలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

## ఏఐటియుసి ఆధ్వర్యంలో సింగరేణి డే వేడుకలు బహిష్కరణ

తాండూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :

బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ, గోలేటి జీఎం కార్యాలయాల్లో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జి ధరించి నిరసన వ్యక్తం చేసి సింగరేణి డే వేడుకలను బహిష్కరించారు. ఏఐటియుసి గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి మాట్లాడుతూ సింగరేణి యాజమాన్య కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. సింగరేణి డే కు బడ్జెట్ కేటాయించపోవడం ఉద్యోగులు, కార్మికుల మనోభావాలను దెబ్బతీయడమన్నారు. ఏరియాలలో పండుగల జరుపుకోవాల్సిన వేడుకలకు యాజమాన్యం నిధులు విడుదల చేయకుండా సాదాసీదాగా నిర్వహించడం సరికాదన్నారు. ఫుట్బాల్ క్రీడాకారుడు మెస్సి పర్యటన కోసం రూ.10 కోట్లు కేటాయించిన సింగరేణి కార్మికుల డేకు నిధులు కేటాయించకపోవడం పట్ల మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక విధానాలను సింగరేణి యాజమాన్యం మానుకోవాలని లేనిపక్షంలో సమ్మె చేసేందుకు కూడా వెనుకాడమన్నారు. కార్యక్రమంలో నాయకులు మారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడిఏ ఏపిఓ యువరాజ్ మర్మాట్ సన్మానిస్తున్న సర్పంచ్

## ఐటీడీఏ పిఓను సన్మానించిన లింగోజితండా సర్పంచ్, ఉప సర్పంచ్‌లు

ఉట్నూర్, డిసెంబర్ 23,ప్రభాతవార్త

మండలంలోని లింగోజితండా గ్రామపంచాయతి కి నూతనంగా బాధ్యత స్వీకరించిన సర్పంచ్ జాదవ్ మాయ, ఉప సర్పంచ్ జాదవ్ హరి నాయక్ లు మంగళవారం ఐటీడీఏ పి ఓ యువరాజ్ మర్మాట్, ఏ ఎస్ పి కాజల్ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించరు. ఏ ఎస్పీ, పి ఓ లు మాట్లాడుతూ ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా మా తరుపున పూర్తిగా అందిస్తామన్నారు. ప్రజలకు అ్దుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, గ్రామపంచాయతిని అభివృద్ధి చేసుకోవాలన్నారు.

## ఆటో కార్మికుల ఉదారత... తోటి డ్రైవర్ కుటుంబానికి భరోసా

**- కృష్ణాకాలనీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నగదు సాయం**

నస్పూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త



వృత్తిరీత్యా తామంతా ఒకే కుటుంబమని, తోటి కార్మికుడు ఆపదలో ఉంటే అండగా నిలవడం తమ బాధ్యతని కృష్ణా కాలనీ ఆటో యూనియన్ సభ్యులు నిరూపించారు. స్థానిక కృష్ణా కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ గంగిపెల్లి కుమార్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆయన పరిస్థితిని గమనించిన తోటి ఆటో డ్రైవర్లు మానవతా దృక్పథంతో స్పందించారు. కృష్ణా కాలనీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యులందరూ కలిసి ఐదు వేల రూపాయల నగదును సేకరించి, కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తమ వంతు చిన్న సాయం ఆయన కుటుంబానికి కొంత ఊరటనిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా కాలనీ ఆటో యూనియన్ అధ్యక్షులు రాగిడి రాజు, గౌరవాధ్యక్షులు పులి భీమయ్య, ఉపాధ్యక్షులు ఎనగందుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి శ్రీను, కోశాధికారి బొబ్బల కుమార్, యూనియన్ నాయకులు నూకల భాస్కర్, రజాక్, కందుల రమేష్, బొబ్బల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్‌టిసి, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ పై పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.




మాట్లాడుతున్న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారుల సంస్థ అధికారులు హైదరాబాదు-కరీంనగర్-చంద్రాపూర్ రహదారిపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని, టోల్‌గేట్ వద్ద నిలిపి వున్న వాహనాలను తక్షణమే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు సెల్లార్ స్థలాలు కేవలం పార్కింగ్ కోసం మాత్రమే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని, నాళాలపై అనధికార నిర్మాణాలను వెంటనే తొలగించాలనీ, సంబంధిత భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. జాతీయ రహదారి 363 పక్కన ఉన్న అక్రమ హోటళ్లు, వ్యాపార కార్యకలాపాలను వెంటనే తొలగించాలని, విద్యుత్ శాఖ అధికారులు రహదారుల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని, మిషన్ భాగీరథ పైప్‌లైన్లు రహదారి అంచుల్లో పాతే ముందు ఆర్ బి శాఖ అనుమతి తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. కూరగాయల వ్యాపారులు రోడ్లపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శ్రీరాంపూర్ బస్ స్టాండ్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు బస్ స్టాండ్ వెనుక భాగానికి మార్చాలని, బస్ స్టాండ్‌కు సంబంధించిన అటవీ అనుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. మందమర్రి వంతెన వద్ద కూరగాయల వ్యాపారులు ఆక్రమించిన ప్రదేశాలను క్లియర్ చేయాలని, హైవేలకు వెళ్లే రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో లైసెన్సులు రద్దు అయిన వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను ప్రతి వారం ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. జనవరి 2026లో రోడ్డు భద్రత ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, రహదారి నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. నూతన సంవత్సరం వస్తున్న సందర్భంలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలకు విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

సిర్పూర్(టి), ప్రభాతవార్త :



సిర్పూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ సలీం అన్న అబ్దుల్ ఖదీర్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం రోజు ఉదయం వారి నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట దుర్గం విక్రమ్ బ్రహ్మయ్య ఇఫత్హుస్సేన్ తదితరులు ఉన్నారు .

## ఇంటి స్థలాల కోసం పాత్రికేయుల దీక్షలు

నిర్మల్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లాలో అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని నిర్మల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్మల్ ప్రెస్ క్లబ్ సభ్యులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దీక్షలో పాల్గొన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వం పాలకులు ఇండ్ల స్థలాలను వెంటనే కేటాయించాలని ఎన్నోసార్లుగా వినతిపత్రం ఇచ్చినప్పటికీ జరగకపోవడంతో న్యాయం ఆందోళన ప్రారంభించడం జరిగిందని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రసం శ్రీధర్ భూస లక్ష్మీనారాయణ తెలిపారు. మొదటి రోజు ధర్నాలు 100 మంది పాత్రికేయులు పాల్గొనగా ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు పలికి సంఘీభావం తెలిపారు.






## బంగ్లాదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసన

కాగజ్‌నగర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :

బగ్లాదేశర్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా మంగళవారం కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాంలో శాంతియుత నిరసన చేశారు. బంగ్లాదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరన చేపట్టారు. ఈ కార్యక్రమంలోఅనూప్ బిస్వాస్, బిధాన్ మండల్, ప్రకాష్ భక్త, మృదుల్ చౌదరి, విక్రమ్ మిస్టరీ,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**- కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం విలేజ్ నెం.12 జెడ్పిహెచ్‌ఎస్ పాఠశాలకు ఈస్గాం ఎస్ఐ కళ్యాణ్‌తో కలిసి క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆకస్తిని పెంపొందించి క్రీడల్లో చురుకుగా పాల్గొనాలనే ఉద్దేశ్యంతో క్రీడా సమాగ్రి అందజేసినట్లు తెలిపారు. క్రీడా సామాగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త

జిల్లాలో దాగి ఉన్న పర్యాటక అందాలను ఫోటోలు, వీడియోల రూపంలో పరిచయం చేసిన వారికి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో భారీ నగదు బహుమతులు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో కల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా యువజన క్రీడా సేవల అధికారి హనుమంతరెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్‌లతో కలిసి కార్యక్రమం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ పోటీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటివరకు ప్రాచుర్యం పొందని పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ పోటీ నిర్వహించబడుతుందని, ప్రజలకు తెలియని జలపాతాలు, పురాతన దేవాలయాలు, ట్రెక్కింగ్ పాయింట్లు వంటి 100 కొత్త గమ్యస్థానాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ప్రకృతి, వన్యప్రాణులు, కళా సంస్కృతి, వారసత్వం, జలాశయాలు, వంటకాలు, గ్రామీణ జీవనం, రిసార్ట్స్, ఆధ్యాత్మిక ప్రాంతాలు, సాహస పర్యటనలు వంటి అంశాలపై ఫోటోలు, వీడియోలు పంపవచ్చని తెలిపారు. ఎంచుకున్న ప్రదేశానికి సంబంధించి 3 మంచి ఫోటోలు, గరిష్టంగా 50 సెకన్ల నిడివి గల వీడియో, ఆ ప్రదేశానికి రవాణా, బస, బడ్జెట్ వివరాలతో కూడిన 100



పదాల సమాచారాన్ని పోస్టర్ లో పేర్కొన్న గూగుల్ ఫామ్ / సోషల్ మీడియా ఎకౌంట్లకు ట్యాగ్ చేయవచ్చని తెలిపారు. ఉత్తమ ఎంట్రీలకు మొదటి బహుమతిగా 50 వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 30 వేల రూపాయలు, తృతీయ బహుమతిగా 20వేల రూపాయలు అందించడం జరుగుతుందని, 10 మందికి హరిత హోటల్స్‌లో 2 రోజులు/ 1 రాత్రి ఉచిత వసతి కన్సోలేషన్ బహుమతులుగా అందజేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జనవరి 5వ తేదీ లోగా ఎంట్రీలు పంపించాలని, విజేతలను సంక్రాంతి కైట్ ఫెస్టివల్ సందర్భంగా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు పగడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

తాండూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :

సిసిఐ ద్వారా పత్తి కొనుగోళ్ల ప్రక్రియ పగడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మండలంలోని రేపల్లెవాడలో వద్ద గల మహేశ్వరి కాటన్ జిన్నింగ్ మిల్లును మంగళవారం కలెక్టర్ సందర్శించి పత్తి కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సిసిఐ ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తిని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. ఈసారి రైతుల సౌకర్యార్థం కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా చేస్తున్నామన్నారు. రైతులు దళారీలను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సి సి ఐ కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ సంవత్సరం క్వింటాల్ పత్తికి 8 వేల 110 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందన్నారు. అధిక దిగుబడి సాధించిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేసి ధ్రువీకరించుకోవాలని సూచించారు. పంట ఉత్పత్తి ఆధారంగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత సమయానికి కొనుగోలు కేంద్రాలకు నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తిని తీసుకువచ్చే విధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు



పత్తి కొనుగోలును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

### ప్రమాణ స్వీకారం చేసిన

## 24 గంటల్లోపే అభివృద్ధి పనులు ప్రారంభం

కాగజ్‌నగర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలం ఈస్‌గామ్ గ్రామంలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఉపసర్పంచ్ లోకండే నరేందర్, వార్డ్ సభ్యులు 24 గంటల్లోపే గ్రామ అభివృద్ధి పనులు ప్రారంభించారు. మంగళవారం గ్రామంలో జేసీబీ డోజర్ సహకారంతో మోరీలు, కాలువలు శుభ్రం చేయడంతో పాటు చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. నూతన సర్పంచ్ అభివృద్ధి పనులు ప్రారంభించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరికిళ్ల కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పూదరి తిరుపతి, బొమ్మగోని సతీష్, అర్కిల్లా మహేష్, పిట్టల భీమ్రావు, అభిషేక్, లోకండే రవి, ఇంద్ర మండల్, రంజిత్ మండల్, రంజిత్ రాయి, సిరి శెట్టి రాజా గౌడ్, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు



పిచ్చి మొక్కలు తొలగింపచేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

## ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ మెంబర్‌గా చిలుక రాజనర్సు నియామకం

బెల్లంపల్లి, డిసెంబర్ 23, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నియామక పత్రాన్ని తీసుకొన్న చిలుక రాజనర్సు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నన్ను మంచిర్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మరియు అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నియమించిన మన ప్రజా ప్రభుత్వనికి అలాగే మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌లకు నా యొక్క హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. నేను మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గా చేస్తున్న సామాజిక ఉద్యమాలు, సమాజ సేవ కర్యక్రమాలు గుర్తించి నా మీద నమ్మకంతో ఈ ఎస్సీ, ఎస్టీ అండ్ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన ఎస్.ఈ ఈడి చాతరాజుల దుర్గ ప్రసాద్, బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ముఖ్యంగా ఈ నియామకం నా పైన మరింత బాధ్యతను పెంచింది ఈ యొక్క బాధ్యతను నేను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తాను అని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా జిల్లాలో ఎస్సీ, ఎస్టిలు ఎదుర్కుంటున్న అక్రమ భూకబ్జా మరియు వారిపైన జరుగుతున్న దాడులు, కుల వివక్ష లాంటి అన్ని సమస్యలను రాజ్యాంగ బద్ధంగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకునివెళ్లి ఆ సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.




పోస్టర్ విడుదల చేస్తున్న టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయులు

## టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సంఘం గోడపత్రిక విడుదల

సిర్పూర్ (టి), డిసెంబర్ 23, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ సిర్పూర్ పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాల పోస్టర్‌ను సోమవారం ఎంఈఓ సదాశివుడు, టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు డి హరీష్, ప్రధాన కార్యదర్శి కె హరీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు డి హరీష్ మాట్లాడుతూ ఈనెల 28,29 తేదీల్లో జనగామలో నిర్వహించనున్న రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాలకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాలను విజయవంతం చేయాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ సిర్పూర్ టి మండల కమిటీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




ప్రత్యేక అలంకరణల నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

## ఈడెన్ గార్డెన్ పాఠశాలలో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

సిర్పూర్ (టి), డిసెంబర్ 23, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని ఈడెన్ గార్డెన్ పాఠశాలలో మంగళవారం రోజున క్రిస్మస్ వేడుకలు పాఠశాల ప్రిన్సిపాల్ బైజు జాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా కార్మెల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ టోనీ పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వారి నృత్యాలతో ఆకర్షణ నిలిచారు. అనంతరం విద్యార్థులకు ఫాదర్ బైజు జాన్ ఫాదర్ టోనీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విమల, ప్రశాంతి, సాగర్, ప్రత్యక్ష జోసేఫ్ సరళ, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి శిబిరానికి స్పందన

కాగజ్‌నగర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టిస్పెషలిటీ ఆసుపత్రిలో కొత్తపల్లి వెంకట లక్ష్మీ- చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితం కంటి శిబిరానికి స్పందన వచ్చినట్లు వారు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన శిబిరానికి 22 మంది హాజరు కాగా వారిలో 8 మందికి శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కంటి పరీక్షలకు వచ్చిన వృద్ధులను అధైర్య పడవద్దని లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్‌లు చేపిస్తామని అన్నారు. ఈ ఉచిత కంటి శిబిరం ప్రతి మంగళవారం నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తమలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్చార్జి గోపి పాల్గొన్నారు.



కంటి శిబిరానికి వచ్చిన వృద్ధులు